సాక్షి చిత్తూరు

శుక్రవారం । 13 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	16
తిరుపతి	32	16
తిరుమల	26	11
గూడూరు	31	18
నగరి	32	17



26న అక్షరాభ్యాసం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో 26న ప్రత్యేక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఇందులో పాల్గొనేవారు రూ.200 టికెట్ తీసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ముఖ్యంగా బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతికి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేసింది. వీటిలో బెంగళూరుకు 24 సర్వీసులు, తిరుపతికి 6 సర్వీసులను అధికారులు ప్రారంభించారు. ఈ బస్సులు గురువారం నుంచి శనివారం వరకు నడుస్తాయి. సెలవుల తర్వాత మళ్లీ ప్రణాళిక ప్రకారం ప్రత్యేక బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ అదనపు సర్వీసుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తామని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని అధికారులు తెలిపారు. రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లను అందజేయాలని ప్రభుత్వం భావిస్తోందని జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన గురువారం వ్యవసాయ ఆధునిక యంత్ర సామగ్రిని తయారు చేసే కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరతో నాణ్యమైన యంత్రాలను సరఫరా చేసేలా కోట్ చేసే వారికి అవకాశం కల్పిస్తామన్నారు. యంత్రాల ధరలను జిల్లా స్థాయిలో నిర్ణయించి కమిషనర్ కార్యాలయానికి పంపుతామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన మేరకు యంత్ర సామగ్రిని సరఫరా చేయాల్సి ఉంటుందని వివరించారు.

16న ఎస్వీ గోశాలలో గోపూజ మహోత్సవం

తిరుపతి రూరల్: స్థానిక శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈనెల 16వ తేదీ కనుమ పండుగ సందర్భంగా గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం 6 నుంచి వేణుగానం, 8 గంటలకు తిరుమల శ్రీ వేంకటేశ్వర వేదపాఠశాల విద్యార్థుల వేదపారాయణం చేయనున్నట్టు వెల్లడించారు. అనంతరం దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనం, కోలాటాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, వేణుగోపాలస్వామి హారతి, తులసీ పూజ, గొబ్బెమ్మ వేడుక, గజపూజ, అశ్వపూజ, వృషభ పూజ తదతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గోపూజ మహోత్సవం రోజున గోవులకు బెల్లం, బియ్యం, గ్రాసం భక్తులు స్వయంగా తినిపించవచ్చని పేర్కొన్నారు.

కోలాహలంగా పరుష పందేలు



దూసుకుపోతున్న కోడెగిత్తలు





వెదురుకుప్పం మండలంలోని నంబాలపల్లెలో గురువారం పశువుల పండుగ సందర్భంగా పరుష పందేలను కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు ఎడ్లకు పలకలు, వస్త్రాలు, దేవతల పటాలు కట్టి ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేస్తూ పరుగులు తీశాయి. వాటిని నిలువరించి పలకలు సొంతం చేసుకునేందుకు పలువురు యువకులు ఉత్సాహం చూపారు. కొంతమంది పలకలను సొంత చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

– వెదురుకుప్పం



కోడె గిత్తను నిలువరిస్తున్న యువకులు

అంతర్మథనం.. అగ్గిమీద గుగ్గిలం!

టీడీపీ అధిష్టానం తీరుపై ఆ పార్టీ ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవులతో సరిపెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒకట్రెండు నియోజకవర్గాలకు అభ్యర్థిత్వాలు ప్రకటించి మిగిలిన వాటిని పట్టించుకోకపోవడంపై రగిలిపోతున్నారు. ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుంటే తమ పరిస్థితి ఏంటని మథనపడుతున్నారు. మూడున్నరేళ్లుగా అందరినీ ఎదిరించి పార్టీ జెండా మోసి ఇప్పుడు పక్కనబెడితే కష్టాలు తప్పవని కుమిలిపోతున్నారు. అందుకే పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉంటూ పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



- అభ్యర్థిత్వాల నాన్చుడు ధోరణిపై రగిలిపోతున్న నేతలు
- పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉన్న ఆశావహులు
- ఉన్నపైసా పోగొట్టుకుంటే తమ పరిస్థితి ఏంటనే మీమాంస
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇదీ పరిస్థితి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీడీపీ పరిస్థితి అయోమయంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి పలువురు పోటీపడు తున్నట్టు పైకి చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని స్పష్టమవుతోంది. ఇన్నాళ్లూ టికెట్ వస్తుందనే ఆశతో కష్టాలకోర్చి, డబ్బులు ఖర్చుచేసినా చివరకు మొండిచెయ్యి మిగులుతుందేమోనన్న బాధ పార్టీ నేతలను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి అభ్యర్థిత్వాలపై నాన్పు డు ధోరణి అవలంబిస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎందుకు ఈ నాన్పుడు బాబు?

ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఆశావహులు ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా ఉంటున్నారు. మూడున్నరేళ్లుగా జెండా మోసిన నేతలు అధిష్టానం తీరుపై రగిలిపోతున్నారు. ఉన్నపైసా పోగొట్టుకుని చతికిలపడడం కంటే మిన్నకుండడమే మేలనే అభిప్రాయానికి వచ్చినట్టు ఆ పార్టీ నేతలే చెబుతున్నా రు. ఈక్రమంలో తిరుపతి నగరంలో మాజీ ఎమ్మె ల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, జేబీ శ్రీనివాసులు బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నట్టు చెబుతు న్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని చర్చించుకుంటున్నారు. టీడీపీతో పొత్తు కుదిరితే జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్, లేదంటే పవన్‌కల్యాణ్ పోటీచేస్తే పరిస్థితి ఏంటనే మీమాంస లో పడినట్టు చెబుతున్నారు. ఇక చంద్రగిరి విషయానికి వస్తే.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తినానికే టికెట్ అని చంద్రబాబు స్పష్టం చేసినా ఆయన మాత్రం వెనకడుగు వేస్తున్నారు. చంద్రగిరి వద్దని, చిత్తూరు టికెట్ ఇవ్వమని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీకాళహస్తి నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి రుయా ఆస్పత్రి అధినేత సిపాయి సుబ్రమణ్యం పేర్లు వినిపించినా వారూ సుముఖంగా లేరని పేర్కొంటున్నారు. వెంకటగిరి స్థానానికి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ వెంకటగిరి వాసి బొలిగల మస్తాన్ యాదవ్ పేర్లు వినిపించినా ఎన్నికల్లో పోటీ చేయడానికి మాత్రం వారు సాహసించడం లేదని అంటున్నారు. సూళ్లూరుపేట టికెట్‌ను నెలవల సుబ్రమణ్యం, పరసావెంకటరత్నం, అల్లుడు సతీష్‌చంద్ర ఆశిస్తున్నా.. వీరిలో ఇప్పటి వరకు ఎవరి పేర్లూ ఖరారు చేయకపోవడంతో అయోమయం నెలకొన్నట్టు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. సత్యవేడు నుంచి మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, జేడీ రాజశేఖర్ టికెట్ కోసం పోటీ పడుతున్నారని చెప్పుకుంటున్నా, వాస్తవంగా వీరెవరూ ఎన్నికలకు సిద్ధంగా లేరని అక్కడి నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. గూడూరు నుంచి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త క్రిష్ణయ్య టికెట్ కోసం పోటీ పడుతున్నారని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని అంటున్నారు.

మేం కనిపించలేదా బాబూ?

కుప్పం నుంచి చంద్రబాబు, పలమనేరు నుంచి మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారు చేసుకుని మిగిలిన వారి పేర్లు ప్రకటించకపోవడాన్ని ఆ పార్టీ సీనియర్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. చిత్తూరు పులివర్తి నాని, మాజీ మేయర్‌కఠారి హేమలత, మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడు కుటుంబం ఎదురుచూపులు ఎండమావులుగా మిగిలిపోతున్నాయని ఆయా నియోజకవర్గ నేతలు మండిపడుతున్నారు. పుంగనూరు నుంచి చల్లా రామచంద్రారెడ్డికి టికెట్ ఖరారు చేసినా.. జనసేనతో పొత్తు కుదిరితే రామచంద్రయాదవ్ టికెట్ ఎగరేసుకుపోయే అవకాశాలు ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతుండడంతో అక్కడివారు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. ఇక జీడీనెల్లూరు, పూతలపట్టు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసేందు కు ఏఒక్కరూ ముందుకు రాకపోగా.. నగరిలో మాజీ మంత్రి ముద్దుకృష్ణమనాయుడు కుమారులు గాలి భానుప్రకాష్, గాలి జగదీష్, మాజీ ఎమ్మెల్సీ గాలి సరస్వతి, సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ అశోక్‌రాజ్ ఆశలు అడియాశలయ్యే అవకా శం ఉన్నట్టు అక్కడి నేతలు చర్చించుకుంటు న్నారు. మొత్తం మీద ఓటమి భయంతోనే చంద్రబాబునాయుడు అభ్యర్థులను ప్రకటించక నాన్చుతున్నారని ఆ పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తుండడం గమనార్హం.

సూక్ష్మసేద్యం పరికరాలు అందజేయండి



మాట్లాడుతున్న పీడీ హరినాథరెడ్డి

కుప్పం : రైతులకు సూక్ష్మ సేద్యం పరికరాలను వెంటనే అందజేయాలని రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ (ఏపీఎంఐపీ) ప్రాజెక్టు ఆఫీసర్ హరినాథరెడ్డి ఆయా కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు, ఏపీడీలు, ఉద్యానవన అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి దరఖాస్తు అందిన వెంటనే ఏపీఎంఐపీ సిబ్బంది, ఆర్బీకేల ఇన్‌చార్జిలు, కంపెనీల ప్రతినిధులు క్షేత్ర పరిశీలన, సర్వేలు పూర్తి చేయాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ వివరాలను రైతులకు వివరించి, ఎక్కువ మంది లబ్ధి పొందేలా చూడాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. డ్రిప్ పరికరాలపై చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల పొలం ఉన్న వారికి 70 శాతం సబ్సిడీ, స్ప్రింక్లర్లపై చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్ రెడ్డి, ఏపీడీ రమణారెడ్డి, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి చర్యలు

చిత్తూరు అర్బన్: టీటీడీ, శ్రీవాణి ట్రస్టు నిధులతో వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 36 ఆలయాల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని తెలిపారు. వాటిని గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. గంగాధరనెల్లూరు, నింద్ర, ఎస్‌ఆర్‌పురం మండలాల్లోని ఆలయాలను సందర్శించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రణాళిక

- ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ హరి నారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పచ్చదనం పెంపునకు భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. ఆయన గురువారం డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డితో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పెంపుతోపాటు ననియాల, దుర్గమ్మకొండ, బోయకొండలో ఎకో టూరిజం, పలమనేరు, చిత్తూరులో నగరవనాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 శాతం అటవీ ప్రాంతం ఉందన్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి 123 ఏనుగులు ఉన్నాయని తెలిపారు. గతంతో పోలిస్తే ఏనుగుల సంఖ్య పెరుగుతోందన్నారు. విద్యుత్ తీగలతో ఏనుగులు చనిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ సోమశేఖర్, ఆర్‌డీఓ రేణుక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఏపీఎస్‌పీడీసీఎల్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో 7,635 మందికి ఉపాధి

జిల్లాలో 2022–23లో రూ.130.39 కోట్లతో 1,785 చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1,785 పరిశ్రమల్లో 7,635 మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు 68 దరఖాస్తులు అందగా 36 ఆమోదం పొందగా, 32 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. పీఎం ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద 2022–23లో నిర్దేశించిన 284 లక్ష్యాల్లో 151 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. జీడీనెల్లూరులో ఏపీఐఐసీ చిత్తూరు జోన్ కింద పరిశ్రమలకు రూ.997.52 లక్షలతో 38 ఎకరాలు కేటాయించినట్టు చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చంద్రశేఖర్, ఏపీఐఐసీ జెడ్ఎం సోని, ఫ్యాక్టరీస్ డీడీ రామకృష్ణారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్ర, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, ఎల్‌డీఎం శేషగిరిరావు, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

విప్లవాత్మక పాలన సీఎం జగన్ సొంతం

- ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం(చిత్తూరు జిల్లా): గొప్ప విప్లవాత్మక ఆలోచనలతో పారదర్శక పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో గురువారం ఆయన పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. 36 మహిళా సంఘాలకు రూ.5.62 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక గొప్ప ఆలోచనలతో జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలియజేశారు. నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యాదీవన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద లాంటి పథకాలతో ప్రజలకు అవసరమైన విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక ప్రజల నుంచి ఫిర్యాదులు సైతం తగ్గిపోయాయని తెలిపారు. అనేక సమస్యలకు స్థానికంగానే, సత్వరమే పరిష్కారం లభిస్తోందన్నారు. ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా పథకాలను పారదర్శకంగా అమలుచేస్తున్నట్టు వివరించారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు ప్రజలు మళ్లీ జగన్‌కే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు, అనంతపురం ఎంపీలు రెడ్డెప్ప, తలారి రంగయ్య, టీడీపీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎమ్మార్సీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కంభంవారిపల్లె పంచాయతీ కురవపల్లెకి చెందిన 18 మంది టీడీపీ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మంత్రి నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీకోసం కష్టపడే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని, తాను అండగా ఉంటానని మంత్రి స్పష్టంచేశారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి

పకడ్బందీగా టీచర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో నేతల సందేహాలను నివృత్తి చేస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా గత ఏడాది జూన్‌లో ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లకు గురువారం డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించారు. జిల్లాలో ఉన్న మొత్తం ఖాళీలను పొందుపరిచారు. ఈ ప్రక్రియను డీఈఓ విజయేంద్రరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పోస్టింగులు పొందిన 169 మందికి రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వస్తాయని వెల్లడించారు. ఈ నెల 19వ తేదీలోపు నూతన పాఠశాలల్లో విధుల్లో చేరాలని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవీ రమణ, గంటామోహన్, దక్షిణామూర్తి, ప్రకాష్‌చంద్రారెడ్డి, కణ్ణన్, మదన్‌మోహన్‌రెడ్డి, జయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో విజిలెన్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న వాహనంతో విజిలెన్స్ అధికారులు

పలమనేరు/వి.కోట: తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా ఎస్పీ ఈశ్వర్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు గురువారం పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో దాడులు చేశారు. బైరెడ్డిపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు వాహనంలో తరలిస్తున్న 2.7 టన్నులు, వి.కోట నుంచి బంగారుపేటకు తరలిస్తున్న 3.3 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్‌చేశారు. రెండు వాహనాలు, ఆరు టన్నుల బియ్యం విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అధికారులు వెంకట్‌రవి, విజయకుమార్ తెలిపారు. బియ్యాన్ని ఆయా మండలాల సీఎస్‌డీటీలకు, వాహనాలను పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. బైరెడ్డిపల్లికి చెందిన నవాజ్, పాతపేటకు చెందిన వినోద్, అరగొండకు చెందిన కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్‌కే నాయక్, సత్యరాజ్, రామచంద్ర, జైరాజ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రాహు-కేతు పూజల పేరిట నిలువు దోపిడీ

శ్రీకాళహస్తి: ఆన్‌లైన్ రాహు-కేతు పూజల పేరిట భక్తులను మోసం చేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. వివరాలు.. శివస్వామి దీక్షిత్ అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం, నిజమాబాద్‌కు చెందిన సతీష్‌రెడ్డికి ఫోన్ చేసి రూ.19 వేలు చెల్లిస్తే ఆన్‌లైన్ రాహు-కేతు పూజ చేయిస్తామని నమ్మబలికాడు. అతను చెప్పిన విధంగా సతీష్‌రెడ్డి కుటుంబం ఆన్‌లైన్ పేమెంట్ చేసింది. ఆపై గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చి విచారణ చేయగా అలాంటిది ఏమీ లేదని చెప్పడంతో ఖంగుతిన్నాడు. తర్వాత పాలకమండలి చైర్మన్‌కు, అక్కడి నుంచి వెళ్లి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కుశస్థలి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి

- రూ.27 కోట్ల కేటాయింపు
- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- నెరవేరిన అర్ధ శతాబ్దం నాటి కల
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం : గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజల అర్ధ శతాబ్దం నాటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. మండలంలోని ఉడమాలకుర్తి వద్ద కుశస్థలి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఇందులో భాగంగా రూ.27 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం జీఓ 14ను విడుదల చేసింది. దీనిపై స్థానికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాలసముద్రం, వెదురుకుప్పం, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు మండలాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కుశస్థలి నదిని దాటాల్సి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో కృష్ణాపురం జలాశయం నిండిన వెంటనే అధికారులు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఆ సమయంలో ఉడమలకుర్తి వద్ద కుశస్థలి నది వద్ద వరద ప్రవాహం ఉద్ధృతంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నదిపై బ్రిడ్జి నిర్మించాలని అనేక ఏళ్లుగా స్థానికులు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని స్థానికులు డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కుశస్థలి నదిని దాటుతూ పలువురు మృత్యువాత పడిన విషయాన్ని సీఎంకు వివరించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. రూ.27 కోట్ల నిధులు విడుదల చేస్తూ గురువారం జీఓ 14 విడుదల చేశారు. దీంతో ప్రజలు సంబరాలు జరుపుకుని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లనాటి కలను నేరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో జగనన్నను తిరిగి గెలిపిస్తామన్నారు.

కాటేజీల నిర్మాణానికి స్థల పరిశీలన



కాటేజీల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో దాతల సహాయంతో కాటేజీల నిర్మాణానికి స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పరిశీలించారు.

ఈఓ కార్యాలయం వెనుక ఉన్న ఆలయ స్థలాన్ని పరిశీలించి నిర్ణయించారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్మాణ వ్యయం అంచనాలను తయారు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. వారికి సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో కాటేజీలు నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఆలయంలో నూతన క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు సులభంగా దర్శనం కల్పించనున్నట్టు వివరించారు.


వివేకానందుని జీవితం ఆదర్శప్రాయం



బహుమతులు అందజేస్తున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : స్వామి వివేకానందుని జీవితం ఆదర్శప్రాయమని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ శిక్షణా సంస్థ ప్రాంగణంలో గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రామకృష్ణ మఠం ద్వారా ఆయన అందించిన సేవలు విలువైనవి చెప్పారు. డీఆర్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రవచనాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథం వైపు నడవాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన యువకులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

పకడ్బందీగా మాక్ పరీక్ష



మాక్ పరీక్ష నిర్వహిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ నియామకంలో భాగంగా ప్రిలిమ్స్ పరీక్ష విధానంపై పోలీసు అధికారులు గురువారం రెండో సారి మాక్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులు చేసే సాధారణ తప్పులను సరిచేయడంతో పాటు ఓఎంఆర్ షీట్‌ను ఎలా పూరించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

మోసపోవద్దు :

ఉద్యోగాల పేరిట కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి నుంచి మోసపోవద్దని జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 100, పోలీస్ వాట్సాప్ 944090000కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు



ఇంటింటా సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ రవిరాజు

నగరి : క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ డీఎండీహెచ్‌వో, టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణశాఖ ఇన్‌చార్జి, జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఆయన గురువారం వీకేఆర్‌పురం, బుగ్గ కండ్రిగలో నిర్వహిస్తున్న క్షయవ్యాధి సర్వేను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని టీబీ వార్డును పరిశీలించి వైద్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ టీబీ రహిత దేశంగా మార్చేందుకు కేంద్రం ఇంటింటా సర్వే చేపట్టినట్టు తెలిపారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారితోపాటు షుగర్, బీపీ ఉన్నవారికి ఇది వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కొన్ని రోజులు దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో 1,559 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారని, నగరి నియోజకవర్గ స్థాయిలో 170 మంది, నగరి మండలంలో 59 మంది ఉన్నారని పేర్కొన్నారు. రోగులకు దాతల సాయంతో ప్రతి నెలా రూ.700 విలువైన పౌష్టికాహారాన్ని అందించే చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయని, రెండు రోజుల్లో జ్వరం తగ్గి నీరసంగా ఉంటే ప్లేట్‌లెట్స్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని దోమకాటు నుంచి రక్షించుకోవాలని పేర్కొన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్‌ఎంవో గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల కోసం డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటు



మాట్లాడుతున్న జడ్జి కరుణ్ కుమార్

చిత్తూరు అర్బన్: క్రిమినల్ కేసుల్లో జైలులో ఉంటున్న, బెయిల్‌పై వచ్చిన ఆర్థిక స్తోమత లేని నిందితుల కోసం సుప్రీం కోర్టు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను ఏర్పాటుచేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది సి.భానుశేఖర్‌రెడ్డితో కలిసి చిత్తూరు నగరంలోని పాత జిల్లా కోర్టు లోని లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వివిధ కోర్టుల్లో అనుభవం కలిగిన ముగ్గురు న్యాయవాదులను జాతీయ లీగల్ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించినట్టు పేర్కొన్నారు. ఇందులో ఉచిత న్యాయ సహాయ ముఖ్య న్యాయవాదిగా సి.భానుశేఖర్ రెడ్డి, ఉచిత న్యాయ సహాయ అదనపు న్యాయవాదిగా జి.మధుసూదన్, ఉచిత న్యాయ సహాయ అసిస్టెంట్ న్యాయవాదిగా సాయి గీత నియమితులయ్యారని వివరించారు. వీరు జిల్లా కేంద్రంలోని మెజిస్ట్రేట్ కోర్టు, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు, జిల్లా కోర్టులో వివిధ క్రిమినల్ కేసులను వాదిస్తారని వెల్లడించారు. ఆర్థిక స్తోమత లేని వారు పాత జిల్లా కోర్టులోనే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయంను ఆశ్రయించాలని తెలిపారు.

అధిక ధరలకు స్టాంప్ పేపర్ల విక్రయం

- 24 మంది వెండర్స్‌పై కేసులు
- లైసెన్సుల రద్దుకు సిఫార్సు

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్న 24 మంది వెండర్స్‌పై కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తనిఖీలు చేపట్టామన్నారు. కుప్పం, నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్ మండలాల్లో 24 మంది వెండర్స్ వారు రూ.50 స్టాంప్ పేపర్‌ను రూ.100ల వరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా స్టాంప్ పేపర్‌పై పాత తేదీలను వేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు తేలిందన్నారు. 24 మందిపై కేసులు నమోదు చేశామని, వారి లైసెన్స్ రద్దు కోసం సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లకు సిఫార్సు చేశామని వివరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు వెంకటరవి, మల్లికార్జునరావు, నాగసురేష్, చెన్నారెడ్డి, విజయ్‌కుమార్, ధనుంజయ, రామకృష్ణ నాయక్, రామ్మోహన్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



శ్రీత్యాగరాజస్వామి వారి పంచరత్న కృతులను ఆలపిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: వాగ్గేయకారుడు త్యాగ రాజ స్వామికి సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంకీర్తనలతో ఘన నీరాజనాలు అందించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో గురువారం త్యాగరాజస్వామి వారి 176వ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ సీవీఎస్‌వో నరసింహ కిషోర్ మాట్లాడుతూ త్యాగరాజస్వామి పంచరత్న కృతులను ప్రతి ఒక్కరూ నేర్చుకుని, రాబోవు తరాలకు అందించాలన్నారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలోని విఘ్నేశ్వర, హనుమత్ సమేత సీతారామ లక్ష్మణులకు, వేంకటేశ్వర స్వామివారికి, శ్రీత్యాగరాజస్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అధ్యాపకులు, విద్యార్థులు మంగళవాయిద్య నీరాజనం సమర్పించారు.

పంచరత్న కృతుల బృందగానం

తమిళనాడులోని తిరువయ్యారు తరహాలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన త్యాగరాజస్వామి ఘనరాగ పంచరత్న కృతుల బృందగానం సంగీత ప్రియులను ఓలలాడించింది. టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



వరదయ్యపాళెం: భారత్ దర్శక్ స్టడీ టూర్‌లో భాగంగా 2022 బ్యాచ్‌కు చెందిన 20 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీలోని ఫాక్స్‌కాన్ మొబైల్ పరిశ్రమ, ఆల్‌స్టామ్ పరిశ్రమలను పరిశీలించారు. వీరికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీలో అభివృద్ధి చెందిన ప్రపంచశ్రేణి మౌలిక వసతులు, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతమని ట్రైనీ ఐఏఎస్‌ల బృందం లీడర్ చిరంజీవ్ ఆనంద్ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. వీరి పర్యటన పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.

వైద్యురాలిపై దాడి కేసులో ఏడేళ్ల జైలు



పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు అర్బన్: వైద్యురాలిపై దాడి చేసి బంగారు అభరణాలు దోపిడీ చేసిన కేసులో నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. చిత్తూరు మండలం కమ్మపల్లికి చెందిన గోవిందరాజు(47), సుగుణ (38) దంత సమస్యతో 2019 జూన్ 19న చర్చివీధిలోని బాలాజీ డెంటల్ క్లినిక్‌కు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇద్దరూ డాక్టర్ సుమతిపై ఇనుప రాడ్‌తో దాడి చేశారు. ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిపై అప్పట్లో సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో ప్రత్యేక శ్రద్ధ చూపి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు భాస్కర్, రమేష్‌ను ఎస్పీ రిశాంత్‌రెడ్డి అభినందించారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరి అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, నిందితుడితో పోలీసులు

తిరుపతి అలిపిరి: ఏర్పేడు మండలం పాపానాయుడుపేట వద్ద 16 ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టుచేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి సూచనలతో కడప ఆర్ఐ ఎం.చిరంజీవులు, ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం బుధవారం తిరుపతి జిల్లా ఏర్పేడు నుంచి కేవీబీపురం వైపు కూంబింగ్ చేపట్టారు. గురువారం ఉదయం తిరుపతి రేంజ్ పాపానాయుడుపేట బీట్ చెల్లూరు పరిధిలోని ఇరగలప్పస్వామి ఆలయం వద్ద కొందరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పట్టుకున్నారు. అతను గుల్లకండ్రిగ గ్రామానికి చెందిన ఆవులూరి పద్మనాభం (41)గా గుర్తించారు. అతనిని అరెస్టుచేసి సమీపంలో ఉన్న 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

బంగారుపాళెం: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని ఎస్టీఓ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగారుపాళెం సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని పెన్షనర్లు ఫిబ్రవరి నెలాఖరు లోపు లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్లుతో పాటు ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకం, పెన్షన్ పుస్తకంతో పాటు మొబైల్ ఫోన్(ఓటీపీ కోసం) తీసుకురావాలని సూచించారు. సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్లు సీఎఫ్ఎంఎస్ ఐడీతో ఆధార్, మొబైల్ ఫోన్ నంబర్లను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈనెల 20 తేదీ లోపు సీఎఫ్ఎంఎస్‌తో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



పుణ్యసముద్రంలో మాట్లాడుతున్న పీడీ గంగాభవాని

తవణంపల్లె: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. గురువారం మండలంలోని పట్నం, పుణ్యసముద్రం సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను, స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరని తెలిపారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాల అర్హుల, అనర్హుల జాబితాలను పరిశీలించారు. ఏపీఓ లలిత పాల్గొన్నారు.

కోడి పందేలు నిషేధం

బంగారుపాళెం: మండలంలో కోడిపందేలు, జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నరసింహారెడ్డి హెచ్చరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం 24మందిని బైండోవర్ చేసి మండల మేజిస్ట్రేట్, తహశీల్దార్ ఎదుట హాజరు పరచారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు., ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లపై ట్రాన్స్‌కో సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి సెక్షన్‌లో రెవెన్యూ వసూళ్లు వందశాతం చేయాలని ట్రాన్స్‌కో అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మచారి అన్నారు. గురువారం ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కంటే బిల్ కలెక్షన్ పెరిగిందన్నారు. పంచాయతీల నుంచి బకాయిలు రూ.96 కోట్లు ఉన్నాయని, నోటీసులు ఇచ్చి వసూలు చేయాలన్నారు. త్వరలో ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తారని, సంబంధిత అధికారులతో మాట్లాడి అందులో 20 శాతం అయినా బిల్లులు కట్టేలా కృషి చేయాలన్నారు. ప్రైవేటు సర్వీసులు బిల్లులు కట్టకపోతే విద్యుత్తు సరఫరా కట్ చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఇన్‌చార్జి ఏఏఓ గోవిందరాజులు, ఏఈలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

పూతలపట్టు: మండలంలోని ఆకానంబట్టు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీఓ గౌరి తనిఖీ చేశారు. కూలి గిట్టుబాటు అవుతోందా అని కూలీలను అడిగారు. ఉపాధి పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గాండ్లపల్లె సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ముత్తిరేవులు గ్రామానికి చెందిన దామోదర్‌నాయుడు(51) గురువారం మృతి చెందినట్టు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. దామోదర్‌నాయుడు ఈనెల 6వ తేదీన ఓ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బండపల్లె వెళుతుండగా రహదారిపై కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు అతని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా... వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బస్సుల కండీషన్ మెరుగు పరచుకోవాలి

డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి

చిత్తూరు రూరల్: బస్సుల కండీషన్‌ను మెరుగు పరచుకోవాలని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన డిపో అధికారులు, గ్యారేజీ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బస్సులోని లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దాలన్నారు. అలాగే ఇంధన పొదుపు పాటించాలన్నారు.

పేదలకు కొండంత భరోసా

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- నాయనిచెరువులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు కొండంత భరోసా లభిస్తోందని ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం నాయనిచెరువు పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 50 ఇళ్లకో వలంటీర్‌ను ఏర్పాటు చేసి ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాల ఫలాలను చేరుస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న సచివాలయాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం పెద్దిశెట్టిపల్లె, తుమ్మింద గ్రామ సచివాలయాల్లో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు త్యాగరాజులు, సంపత్, వెంకటేష్, మునిరత్నం, రామూర్తి, దేవేంద్ర, శేఖర్, జైపాల్, కుమార్, నంద, రంజన్, వాసు, బాబు, మనోహర్, రాజేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ, ఎంఈఓ సెల్వరాజ్, ఏఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు బాక్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలోని 50 వార్డు సచివాలయాల్లోనూ ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ జె.అరుణ అన్నారు. సెలవు రోజులు, కార్యాలయ పనివేళల ముగిసిన తర్వాత స్థానికులు సమస్యలను అధికారుల దృష్టికి తేవడం కోసం ఈ బాక్సులను వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం, స్పందన కార్యక్రమం నిర్వహణ, పౌర సేవలు, మోడల్ సచివాలయాలు అంశాలపై గురువారం నగరపాలక కార్యాలయంలో వార్డు కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని బీఎల్వోలు ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానాన్ని 100 శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి వార్డు సచివాలయంలోనూ మధ్యాహ్నం 3 నుంచి రెండు గంటలపాటు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. తద్వారా వచ్చిన వినతులను తప్పనిసరిగా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. 'స్పందన' వినతులను నమోదు కోసం ప్రత్యేక రిజిస్టర్లను ఇస్తామన్నారు. వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, సిటిజన్ సర్వీసులపై ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో 9, 10 వార్డు సచివాలయాలను ఆదర్శ సచివాలయాలుగా తీర్చిదిద్దుతున్నామని... త్వరలో అన్ని వార్డు సచివాలయాల్లోనూ ఇదే తరహా పనులకు పూనుకుంటామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, మెప్మా సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రైతు నేత మృతి



ఆరుద్రరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: మండల వైఎస్సార్‌సీపీ రైతు నాయకుడు ఆరుద్రరెడ్డి గురువారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు సంపత్, కన్నన్, రాజా, రాబర్ట్, రంజన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా

బంగారుపాళెం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక నాయకుడు ఎంబీ రాజేష్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లలో పాల్గొనడం ద్వారా యువతలో స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. రాజేష్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 10 జట్లు పాల్గొంటున్నాయని, విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10 వేల బహుమతిని అందజేయనున్నట్లు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా వాలీబాల్ మాజీ కోచ్ సుదర్శన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలపై గురువారం పీఆర్‌టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావుతో చర్చించారు. జిల్లాలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తు, సర్దుబాటు మొదలైన అంశాలపై మాట్లాడారు. అనంతరం పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్లను డీఈఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్ చంద్రారెడ్డి, కణ్ణన్, ఇతర నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో పంచమి



పుత్తూరు: ద్రౌపదీదేవి ఆలయంలో

పుత్తూరు రూరల్: పుష్యమాసం బహుళ పంచమిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పళ్లిపట్టుకు చెందిన పండితుడు పయణి భగవద్గీత పారాయణం, సంకీర్తనల ఆలపన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గురుప్రసాద్ భాగవత పారాయణం, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ లారీ మోహన్ పర్యవేక్షించారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయంలో శ్రీగురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. బహుళ పంచమి తిథిని పురస్కరించుకుని తొలుత వినాయక పూజ, కలశ పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృతం, చందనంతో అభిషేకం చేశారు. సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మహామంగళ హారతులిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గీతామందిరంలో.. గీతా మందిరంలోని శ్రీకృష్ణుడికి గురువారం పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు చేశారు.

జ్యోతి దర్శనం రేపు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం జ్యోతి దర్శనం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు తిరువాభరణ యాత్ర ఈశ్వరగుడి వీధి నుంచి బజారువీధి, హైరోడ్డు, గిరింపేట, కలెక్టరేట్ మీదుగా ప్రశాంత్‌నగర్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం 6.45 గంటలకు జ్యోతి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



దిగువమోదలపల్లెలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

తవణంపల్లె: రీసర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని, సర్వేను పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని తహసీల్దార్ సుశీలమ్మ ఆదేశించారు. గురువారం మండలంలోని టి.పుత్తూరు, ఎగువ తవణంపల్లె, దిగువ మోదలపల్లెలో జరుగుతున్న భూ రీ సర్వేను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేసి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించుకోవాలని తెలిపారు. సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. మండలంలో టి.పుత్తూరు, ఎగువ తడకర, మత్యం, ముట్టుకూరు, దిగువమాఘం రెవెన్యూ గ్రామాల్లో భూ రీ సర్వే చురుగ్గా జరుగుతోందని తెలిపారు. సర్వేయర్ బాబు, వీఆర్‌ఓ రాజశేఖర్, వలంటీర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సుబ్రమణ్యం

యాదమరి : ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని చిత్తూరు క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన మండలంలోని దాసరాపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో కూలీల రిజిస్టర్ పరిశీలించి, సిబ్బందితో సమావేశమయ్యారు. మండల పరిధిలో 9 వేలకు పైగా జాబ్ కార్డులు ఉండగా కనీసం వెయ్యిమంది కూడ పనిచేయడం లేదన్నారు. సిబ్బంది గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ కవిత, ఈసీ రమ్య పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మేఘ స్వరూప్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం తనిఖీ చేశారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ఆస్పత్రిలోని సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా కోవిడ్ రోగులకు బెడ్లు, ఆక్సిజన్ సౌకర్యాలపై ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ హరగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ మమతారాణి, వైద్యులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు హెచ్‌సీ లీలామోహన్ తెలిపారు. మండలంలోని కొళత్తూరు పంచాయతీ చదళ్లవారిపల్లెకు చెందిన చంద్రప్ప కుమారుడు రాజశేఖర్(30) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతని ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో అతడి ఇంట్లో 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉండగా గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు.

గడప గడపలో సంక్షేమ ఆనందం



చినకాంపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేరుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని చినకాంపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 200 కుటుంబాలను కలసి ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించి పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోను డస్ట్‌బిన్‌లో వేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, మేనిఫెస్టోలోని హామీలను మూడన్నరేళ్లలో 98 శాతం నెరవేర్చిన ఖ్యాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరిస్తే మరిన్ని పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తారని తెలిపారు. అనంతరం పార్టీ నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లుతో సమావేశం నిర్వహించారు. పథకాల అమలు, స్పందన అర్జీల పరిష్కారంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మోహన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, ఏఎంసీ మెంబర్ రామచంద్ర, పార్టీ నేతలు చిన్నారెడ్డి, చంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, బెనర్జీరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలకం

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



పాత్రికేయులకు సంక్రాంతి కానుక అందజేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలమని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. సంక్రాంతి పురస్కరించుకుని చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన పాత్రికేయులకు 'సంక్రాంతి కానుక' అందజేసి మాట్లాడారు. తాను పార్టీలకు అతీతంగా ఈ కానుక ఇస్తున్నట్లు చెప్పారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయులు ముందున్నారని, అలాగే చిత్తూరు అభివృద్ధిలో కూడా తమవంతు పాత్ర పోషించాలని కోరారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఆయన్ను సన్మానించింది. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాధన్, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి పవన్, ఉపాధ్యక్షులు మహేష్, తులసీరాం, సభ్యులు మురళీకృష్ణ, శివ, ప్రదీప్, చంద్ర, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం వివేకానంద



మాట్లాడుతున్న సీఎస్ఆర్ కాలేజీ కరస్పాండెంట్ లోకేష్

గుడిపాల: యువతకు స్వామి వివేకానంద ఆదర్శప్రాయులని సీఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. గురువారం స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలను సీఎస్ఆర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. నిర్వహించారు. కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానంద అని కీర్తించారు. ఆయన స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కందిపప్పు నాణ్యత భేష్!



ఉడికించిన కందిపప్పును పరిశీలిస్తున్న అధికారులు



కందిపప్పు నాణ్యతను ప్రజలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

చిత్తూరు రూరల్: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారుల ఆదేశాల మేరకు చిత్తూరు నగర పరిధిలోని అనుపల్లె చౌకదుకాణం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కందిపప్పు నాణ్యతను పరిశీలించారు. ప్రజల సమక్షంలో కందిపప్పును ఉడికించి చూశారు. ఆపై కందిపప్పు ఎలా ఉందని డీఎస్‌ఓ శంకరన్, సంస్థ మేనేజర్ మోహన్‌బాబు స్థానికులను ప్రశ్నించారు. దీంతో స్పందించిన అక్కడి స్థానికులు కంది నాణ్యత బాగుందని చెప్పారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



గుడిపాల : అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సంక్రాంతి వేడుకలు

గుడిపాల: సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. గురువారం 197రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ జనార్ధన్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

పిల్లలకు పోటీలు

చిత్తూరు రూరల్: సంక్రాంతి పురస్కరించుకుని చిత్తూరులోని బాలవికాస్ పిల్లలకు గురువారం శ్రీసత్యసాయి సేవా సమితి పలు పోటీలను నిర్వహించింది. 30 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 15న బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు మధుసూదనం తెలిపారు.

కురుడుమలై వినాయకస్వామి సేవలో జెడ్పీ చైర్మన్



వినాయకస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్, కుటుంబ సభ్యులు

వి.కోట: కర్ణాటక రాష్ట్రంలోని కురుడుమలై దేవస్థానంలో ఉన్న వినాయకస్వామివారిని గురువారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆయన సతీమణి భాగ్యమ్మ, కుమారుడు నరేంద్ర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటక రాష్ట్రంలో ఉన్న కురుడుమలై వినాయకస్వామి అత్యంత శక్తివంతమైన, కొరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందారన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి జయంతి



త్యాగరాజస్వామి జయంతి వేడుకల్లో నాయకులు

పుంగనూరు: పట్టణంలో త్యాగరాజస్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హేమంత్‌కుమార్, సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత హాజరై త్యాగరాజస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘానికి ఎంపీ మిథున్‌రెడ్డి రూ.50 వేలు విరాళం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, అమరేంద్ర, జయకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకుడు రాజు, గాండ్ల సంఘ నాయకుడు కుమార్, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు రమణ, చంద్రన్న, లోకేష్, ఆంజన్న, వెంకట్రమణ, రాజశేఖర్, అమ్ము లు , రాజన్న, శేఖర్, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

IV
సాక్షి ఫ్యామిలీ
తిరుపతి
శుక్రవారం। 13-1-2023

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.


వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్



పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

> **దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.**

ప్రణయ్ ఫొటోలతో రూపు దిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఒషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతిహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.


క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.